


నాన్నకు ప్రేమతో..



తెలుగు వెలుగు కార్యాలయం వద్ద ఆదివారం అంతర్జాతీయ పితృ దినోత్సవం సందర్భంగా చిన్నారులు 'నాన్న' ఆకృతిలో కూర్చుని ఆకట్టుకున్నారు. తెలుగు ఉపాధ్యాయులు మక్కువ చంద్రకళాధర్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించారు.
-ప్రజాశక్తి, విజయనగరం



విక్రయానికి సిద్ధంగా ఉన్న పాఠ్యపుస్తకాలు

కార్పొరేట్ విద్యాసంస్థల మాయాజాలం

జిల్లాలోని అకడమిక్ విద్యా సంవత్సరం ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలకు కాసుల పంట పండిస్తోంది. ఎల్‌కెజి నుంచి ఇంటర్మీడియట్ వరకు పుస్తకాలు, యూనిఫాం పేరుతో కోట్లాది రూపాయల దోపిడీ బహిరంగంగానే సాగుతోంది. ఇటువంటి అక్రమ వ్యాపారాన్ని కట్టడి చేయాల్సిన జిల్లా విద్యాశాఖ యంత్రాంగం తెలిసినప్పటికీ నిద్రావస్థలో జోగుతుండడంపై విమర్శల వర్షం కురుస్తోంది.

- పుస్తకాల పేరిట దోపిడీ
- విద్యా హక్కు చట్టానికి తూట్లు
- బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు జలగల్లా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఫీజులు, పుస్తకాల రూపంలో పీల్చుకుతింటున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఫీజులు అధికంగా పెంచేయడంతో పాటు పుస్తకాల ధరలను అమాంతంగా పెంచేశాయి. ప్రతి తరగతిలోనూ రకరకాల పేర్లతో సెక్షన్లు పెట్టి ఒక్కో తరగతి పుస్తకాలను రూ.10వేల నుంచి రూ.20 వేల వరకు విక్రయిస్తూ దోపిడీ చేస్తున్నాయి. పుస్తకాలు మరెక్కడా దొరకవని, తమ వద్దే కొనాలని నిబంధన విధిస్తున్నారు. మరోవైపు పూర్తిస్థాయిలో పుస్తకాలు ఇవ్వకుండా సంవత్సరమంతా తిప్పుతూ నానా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్ వాటి గురించి పట్టించుకోపోవడం పట్ల ప్రయివేటుకు కొమ్ముకాస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా పుస్తకాలు విక్రయించడాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకుంటున్నారు. అయినా అధికారుల చర్యలు తూతూ మంత్రంగానే ఉంటున్నాయి.

జిల్లా వ్యాప్తంగా 2,230 ప్రభుత్వ పాఠశాలలు, 427 ప్రయివేటు, 500 కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 1,56,156 మంది విద్యార్థులున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ధీటుగా ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో లక్ష మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. విద్య మార్కెట్ సరుకుగా మారిన నేపథ్యంలో తల్లిదండ్రుల ఆశలను, ఆకాంక్షలను సొమ్ము చేసుకునేందుకు ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలు కాన్సెప్ట్, టెక్నో, ఇ-టెక్నో, డిజిటల్, విజువల్ వంటి పదాల మాటున దోపిడీకి గేటులెత్తడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రాకమునుపే అడ్మిషన్లు, పుస్తకాలు, యూనిఫాం పేరుతో రూ.కోట్లలో వ్యాపారాల్ని సాగిస్తున్నాయి. నర్సరీ నుంచి పదో తరగతి వరకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేస్తూ నిలువుదోపిడీ చేస్తున్నారు. విజయనగరంలోని కొన్ని ప్రయివేటు. కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో రూ.1.30 లక్షలు వసూలు చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

పాఠ్య పుస్తకాలను ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో విక్రయాలు చేయకూడదని నిబంధనలు చెబుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. నర్సరీ, యుకెజి, ఎల్‌కెజి నుంచి ఐదో తరగతి వరకు రూ.3 వేల నుంచి 5 వేలు, ఆరు నుంచి పదో తరగతి వరకు రూ.7 వేల నుంచి రూ.9 వేల వరకు వసూలు చేస్తుండటం విస్మయాన్ని కలిగిస్తోంది. యూనిఫాం, టై, బెల్ట్, షూస్ పేరుతో రూ.మూణ్నాలుగు వేల వరకు వసూలు చేస్తున్నారు. బహిరంగంగా అక్రమ వ్యాపారం సాగిపోతున్నా విద్యాశాఖ యంత్రాంగం నిద్రమత్తులో జోగుతుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. విద్యాసంస్థల యాజమాన్యాల లాబీయింగ్‌కు, ప్రలోభాలకు వెరసి ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల వైపు కన్నెత్తి చూడటానికి జంకుతుండడం గమనార్హం. ఇప్పటికే ఈ అక్రమ వ్యాపారంపై ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన సాగించి, రెడ్ హ్యాండెడ్‌గా పట్టిస్తున్నారు. అయినా తూతూ మంత్రంగా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలపై ఆదాయ పన్నుల శాఖ ఎందుకు దృష్టిసారించడం లేదో అర్థం కావడం లేదనే విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తుండటం గమనార్హం.

నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు



అకడమిక్ విద్యా సంవత్సరంలో నిబంధనలు ఉల్లంఘించిన కళాశాలల, పాఠశాలల యాజమాన్యాలపై భారీ జరిమానాలు విధిస్తాం. ఆధారాలు సైతం అందజేస్తే చర్యలు తీసుకోవడానికి వెరవబోం.

- డిఇఒ లింగేశ్వర రెడ్డి


ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పుస్తకాల అమ్మకాలు చేపడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.వెంకటేష్, పి.రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాహక్కు చట్టాన్ని తుంగలోకి తొక్కి పుస్తకాలు, యూనిఫాం అధిక రేట్లకు అమ్మి వ్యాపారం చేసుకుంటున్నారని చెప్పారు. శనివారం పూసపాటిరేగ మండలంలో ఉన్న ఓక్లాండ్ స్కూల్లో ఎస్ఎఫ్ఐ బృందం పుస్తకాల అమ్మకాన్ని అడ్డుకుని, చర్యలు తీసుకోవాలని ఎంఇఒ రమణమూర్తిని కోరితే, ఏమీ సంబంధం లేన్నట్లు వ్యవహరించారని చెప్పారు. ఒత్తిడి చేస్తే పోలీసులతో అరెస్ట్ చేయిస్తానంటూ ఎంఇఒ పాఠశాల యాజమాన్యానికి మద్దతుగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తంచేశారు. శృంగవరపుకోటలో

విచ్చలవిడిగా పుస్తకాల అమ్మకాలు

రిజిస్ట్రేషన్ లేకుండా నడుపుతున్న నారాయణ కేంబ్రిడ్జి పాఠశాల యాజమాన్యం ఒక ఇంట్లో పుస్తకాలు విక్రయిస్తుండగా, దీనిపై చర్యలు తీసుకోవాలని ఎంఇఒ సత్యనారాయణను కోరితే, అది తన పని కాదని బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. విద్యార్థులకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వ అధికారులే బాధ్యతలు విస్మరిస్తుంటే, సామాన్య విద్యార్థులకు ఎలా విద్య అందుతుందని ప్రశ్నించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన పూసపాటిరేగ, ఎస్.కోట ఎంఇఒలపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు.



కార్పొరేట్ పాఠశాలలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన యూనిఫాం



ప్రతిభ కనబరిచిన విద్యార్థికి పురస్కారం అందజేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

విద్యే రాష్ట్రానికి పెట్టుబడి

- సమాజ వికాసానికి ఉపాధ్యాయులే కీలకం
- విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ
- జిల్లా స్థాయిలో ఆణిముత్యాలకు రూ.46.28 లక్షలు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విద్యనే రాష్ట్రానికి పెట్టుబడిగా భావిస్తున్నామని, అందుకోసమే సిఎం జగన్‌మోహన్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఫలితాలను మెరుగుపరచడం కోసం అనేక చర్యలు చేపడుతున్నారని వెల్లడించారు. మన రాష్ట్రంలో విద్యా రంగంలో అభివృద్ధిని అధ్యయనం చేయడానికి ఇతర రాష్ట్రాల వారు కూడా రావడం మంచి పరిణామమన్నారు. శనివారం స్థానిక కస్పా హైస్కూల్‌లో జిల్లా స్థాయి ఆణిముత్యాలకు నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుతూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు, పురస్కారాలు ఇచ్చేందుకు ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు పేరుతో సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులనే కాకుండా వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను కూడా సన్మానించడం ద్వారా మిగిలిన వారికీ స్ఫూర్తి కలుగుతుందని ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. బై లింగువల్ టెక్స్ట్ బుక్స్‌తో రెండు భాషల్లో తెలుగు, ఆంగ్లం ఒకే సారి బోధించడంతో విద్యార్తులు ఆంగ్ల భాషపై పట్టు సాధించగలరని చెప్పారు. ఈ బోధనకు ఉపాధ్యాయులే ముఖ్యమని, చిత్తశుద్ధి తో విద్యార్థులను తీర్చిదిద్ది సమాజ వికాసానికి తోడ్పడాలని కోరారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ పేదలు, ధనికులు తారతమ్యం లేకుండా అందరినీ సమానంగా చూడాలనే విద్యాపరంగా అనేక కార్యక్రమాలను ముఖ్యమంత్రి చేపడుతున్నారని తెలిపారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో లక్షా 45 వేల మంది పిల్లలకు జగనన్న విద్యా కానుక పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని చెప్పారు. 392 పాఠశాలల్లో స్మార్ట్ టివిల ద్వారా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి విద్యార్థులకు జిల్లా స్థాయిలో 330 మందికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఇంటర్మీడియట్‌లో 1008 మందికి అందజేశారు. జిల్లా స్థాయిలో ఆణిముత్యాలకు రూ.46.28 లక్షల నగదు పురస్కారాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, నగర మేయర్ విజయలక్ష్మి, డిఇఒ లింగేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కెఎల్ఎస్‌హెచ్ పాఠశాల ప్రారంభం

నగరంలోని 23వ డివిజన్‌లో కోలగట్ల లక్ష్మి సన్యాసిరాజు హయగ్రీవ ప్రాథమిక పాఠశాలను మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ శిథిలమైన హయగ్రీవ పాఠశాల స్థానంలో కోలగట్ల కృష్ణారావు కుటుంబ సభ్యులు ముందుకొచ్చి వారి తల్లిదండ్రులైన కోలగట్ల సన్యాసిరాజు, లక్ష్మి జ్ఞాపకార్థం రూ.25 లక్షలను వెచ్చించి పాఠశాలను నిర్మించారన్నారు. కౌన్సిల్ తీర్మానం అనంతరం కోలగట్ల లక్ష్మి సన్యాసిరాజు హయగ్రీవ ప్రాథమిక పాఠశాలగా నామకరణం చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కృష్ణారావు కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్, తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ప్రముఖ న్యాయవాది కోలగట్ల తమన్న శెట్టి, ఎఎంసి చైర్మన్ శశి భార్గవి, ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, ఎంఇఒ రాజు తదితరులు పాల్గొన్నారు.



సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న యూనియన్ నాయకులు, చిత్రంలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివారావు

కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి వారి జీవితాల్లో వెలుగులు నింపారని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కొనియాడారు. కాంట్రాక్టు పారామెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కాంట్రాక్టు ఉద్యోగులు స్థానిక జెడ్‌పి ప్రాంగణంలో సిఎం జగన్ చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ మంచి చేయాలన్నది ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. ఏళ్ల తరబడి కాంట్రాక్టు ఉద్యోగులు తమను పర్మినెంట్ చేస్తారని ప్రభుత్వం వైపు ఆశగా ఎదురు చూస్తున్నప్పటికీ, ఇన్నాళ్లూ ఎవరూ పట్టించుకోలేదని చెప్పారు. కాంట్రాక్టు ఉద్యోగుల ఇబ్బందులను గుర్తించిన సిఎం జగన్ వారి ఆశను నిజం చేశారని తెలిపారు. దీనివల్ల పదివేలకు పైగా కుటుంబాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వివిఎస్ఆర్ ప్రసాద్, జిల్లా నాయకులు ఎస్‌వి చిన్నారావు, నాయుడు, సత్యనారాయణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్లు

వినియోగించుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి పిలుపు

ప్రజాశక్తి-గంట్యాడ

సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. గంట్యాడ మండలం నరవ గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ శనివారం సాయంత్రం పరిశీలించారు. జిల్లా కలెక్టర్, జెసి సమక్షంలో, గ్రామానికి చెందిన పితాపురం లక్ష్మి ఇంటి తనఖా రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్వహించారు. అనంతరం ఆమెకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. దీనికి సంబంధించిన ఫ్లెక్సీలను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ సచివాలయాల ద్వారా ఇంటి ముంగిటకే పాలనా వ్యవస్థను తీసుకొచ్చిన ప్రభుత్వం, తాజాగా రిజిస్ట్రేషన్ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. దేశంలో ఇప్పటివరకు ఎక్కడా లేని విధంగా, మన రాష్ట్రంలో అందుబాటులోకి వచ్చిన ఈ ప్రక్రియను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో 118 సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ సేవలను పొందవచ్చని సూచించారు. ఈ సచివాలయాల్లో అన్ని రకాల దస్తావేజులు, వ్యవసాయ భూములు, వీలునామాలు, దత్తత మొదలైన రిజిస్ట్రేషన్లను చేసుకోవచ్చునని సూచించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, జిల్లా రిజిస్ట్రార్ ఎవి కుమారి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రాజా, సబ్ రిజిస్ట్రార్ టివికెఎస్ లక్ష్మణరావు, తహశీల్దార్ రాఘవ, డిప్యూటీ తహశీల్దార్ స్వర్ణకుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

శిక్షణాభ్యర్థులకు అండగా ఉంటాం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అగ్నివీర్ నియామకాలకు సంబంధించి ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ఏ అవసరం వచ్చినా అండగా ఉంటామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. అభ్యర్థులకు అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నామని, శిక్షణపైనే దృష్టిసారించి కొలువులు సాధించాలని సూచించారు. యవజన సర్వీసుల శాఖ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో అగ్నివీర్ నియామకాలకు సంబంధించి ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు శనివారం తన నివాసం వద్ద బూట్లు, సాక్సులు, టీషర్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణకు కావాల్సిన అన్ని సౌకర్యాలనూ సమకూర్చేందుకు తనతోపాటు, జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఏ అవసరం వచ్చినా నిరభ్యంతరంగా తమను సంప్రదించవచ్చని తెలిపారు. సెట్విజ్ సిఇఒ బి.రామగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

నానీ.. నోరు అదుపులో పెట్టుకో

ఎమ్మెల్యే పేర్నిపై జనసేన ఆగ్రహం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎమ్మెల్యే పేర్ని నాని నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకుంటే చెప్పుల వర్షంతో ముంచెత్తుతామని జనసేన నాయకులు గురాన అయ్యలు హెచ్చరించారు. ఎమ్మెల్యే పేర్ని నాని చెప్పులు చూపిస్తూ పవన కళ్యాణ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శనివారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద అయ్యలు ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. పేర్ని నాని ఫొటోకు చెప్పుల దండవేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అయ్యలు మాట్లాడుతూ వైసిపి నాయకులంతా ఆధారం లేకుండా తప్పుడు వ్యాఖ్యలు చేయడంతో పవన్‌కళ్యాణ్ చెప్పుతో కొడతామన్నారని గుర్తుచేశారు. పవన్ కళ్యాణ్ సొంత నిధులు కోట్లాది రూపాయలను కౌలు రైతులకు సాయం చేశారని, ఎప్పుడూ దమ్ముకోసం మాట్లాడే వైసిపి నాయకులు పవన్ సహాయంలో కొంతైనా చేసి దమ్మున్న నాయకులమని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఆదాడ మోహనరావు, ఝాన్సీ వీర మహిళ మాతా గాయిత్రి, నాయకులు వంక నరసింగరావు, దంతులూరి రామచంద్రరాజు, త్యాడ రామకృష్ణారావు, ఎంటి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



పేర్ని నాని చిత్రపటానికి చెప్పులదండ వేసి నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

ఆత్మహత్యకు కారకులెవరు?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇంతవరకు ప్రేమ వ్యవహారాల్లో విఫలమైనవారు, అప్పుల బాధలు తాళలేక రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం, ఆర్థిక ఇబ్బందులు, వేధింపులు వంటి కారణాలతో తనువు చాలించడం వంటివి మాత్రమే కనిపించాయి. తాజాగా బొబ్బిలి మండలం అలజంగి గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ లక్ష్మునాయుడు చేపట్టిన నిర్మాణ పనులకు బిల్లులు విడుదల చేయలేదని ఏకంగా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే తనను గుర్తించలేదని, పైగా తనను ఎన్నుకున్న ప్రజల ముందే అవమానిస్తున్నారని కూడా ఆయన మనస్తాపం చెందినట్టు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అభివృద్ధి పనులు చేస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోయిన కుటుంబాలన్నీ ఉలిక్కిపడ్డాయి. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై జిల్లాలో చర్చోపచర్చలు సాగుతున్నాయి. వాస్తవానికి ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులకు సంబంధించిన బకాయిలు అంతాఇంతా కాదు. జిల్లాలో రూ.కోట్లలో పెండింగ్ ఉన్నాయి. అందుకు తగ్గట్టే ప్రభుత్వ భవనాలు అసంపూర్తితో వెక్కిరిస్తున్నాయి. ఉపాధి హామీలో 40 శాతం నిధులను మెటీరియల్ కాంపొనెంట్ పనులకు కేంద్రం కేటాయించాల్సి ఉంటుంది. ఉపాధి హామీ పనులు ఉపయోగించుకోవడంలో



మన జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. వీటిపై జనరేట్ అయిన నిధులతో ప్రభుత్వం తలపెట్టిన సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, బల్క్‌మిల్క్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలు తదితర భవనాలు నిర్మించాలని భావించింది. దాదాపు అన్ని గ్రామాల్లోనూ స్థానిక సర్పంచులు, లేదా వార్డు మెంబర్లు, కాస్త ఆర్థికంగా అవకాశం ఉన్నవారు అప్పులు చేసి మరీ నిర్మాణ పనులు చేపట్టారు. నిధులు మాత్రం సకాలంలో విడుదల చేయడం లేదు. ఈ ఏడాది రూ.కోట్లలో మెటీరియల్ కాంపొనెంట్ నిధులు విడుదల కావాల్సి ఉంది. అంతకు ముందు సంవత్సరాల్లో చేపట్టిన పనులకు కూడా ఇంకా బిల్లులు కాలేదనే చర్చ నడుస్తోంది. వాస్తవానికి వైసిపి జిల్లా ప్లీనరీ సమావేశాల్లో కూడా సాక్షాత్తూ ఎమ్మెల్యేలు మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, పార్టీ రాష్ట్ర బాధ్యుల ఎదుట ఏకరువు పెట్టారు. ఈ సమస్యను గుర్తించి పరిష్కరించకపోతే భవిష్యత్తులో ప్రభుత్వానికి, పార్టీకి పెద్ద నష్టమే జరుగుతుందని కూడా ఆవేదన వెల్లగక్కారు. నేతలంతా మనకెందుకులే అనుకున్నారో లేక అధినేత తిరస్కరించారో గానీ బిల్లులు పెండింగ్ సమస్య ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లు ఉంది. దీంతో, ఇన్నాళ్లూ కక్కలేక మింగలేక వ్యవహరిస్తున్నవారు తాజాగా బాహాటంగానే ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరుగుతున్నారు. ఇప్పుడు ఆత్మహత్య వరకు వెళ్లడం అత్యంత బాధాకరం. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి నిధులు విడుదల చేయాలని జనం కోరుతున్నారు.

తెలివితేటలతో మెప్పుపొందాలి

ప్రజాశక్తి-విజయనగరం

పోలీసు మహిళా విభాగం అన్ని రంగాల్లో విధులు నిర్వహించేటప్పుడు తెలివితేటలతో అధికారుల మెప్పు పొందాలని ఎస్‌పి దీపిక పాటిల్ సూచించారు. స్థానిక పిటిసిలో ఇంటిలిజెన్స్, ఎస్ఎస్‌జి ఆధ్వర్యాన నిర్వహించిన మూడు రోజుల శిక్షణ శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి హాజరైన ఎస్‌పి మాట్లాడుతూ విఐపిల రక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలను వివరించారు. ప్రతి జిల్లా నుంచి 8 మంది చొప్పున మొత్తం 52 మంది మహిళా సిబ్బంది వివిధ ర్యాంకుల్లో ఈ శిక్షణకు హాజరైనట్లు చెప్పారు. రాష్ట్రం మొత్తం 208 మంది మహిళా సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌జి డిప్యూటీ డైరెక్టర్ డి.ఆశీర్వాదం, పిటిసి వైస్ ప్రిన్సిపల్ పి.వి.అప్పారావు, డిఎస్‌పిలు వివి అప్పారావు, రామారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి
www.prajasakti.com

క్షతగాత్రులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి -కొత్తవలస

పని ముగించుకుని వస్తుండగా మార్గమధ్యంలో ఆటో బోల్తా పడి గాయాలు పాలైన చీపురవలస ఉపాధి కూలీలను అన్ని విధాలుగా ప్రభుత్వమే ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు డిమాండ్ చేశారు. చీపురువలస గ్రామానికి చెందిన ఉపాధి కూలీలను శనివారం ఆయన వారి గృహాలకు వెళ్లి పరామర్శించారు. తీవ్రంగా గాయాలు పాలైన వారిని తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఇన్సూరెన్స్ వచ్చేలా ప్రభుత్వం చూడాలని కోరారు. తీవ్రంగా గాయపడిన అక్కునాయుడు, రామలక్ష్మి, లక్ష్మి, రమణమ్మలకు తక్షణ సహాయం అందించాలని కోరారు.

టిడిపి తూర్పుకాపు కన్వీనర్‌గా 'చింతపల్లి'

ప్రజాశక్తి - నెల్లిమర్ల


చింతపల్లి రమణ

మండలంలోని సతివాడ మాజీ ఎంపిటిసి, టిడిపి సీనియర్ నాయకులు చింతపల్లి వెంకటరమణ పార్లమెంటరీ స్థాయి తూర్పుకాపు సాధికారిక కమిటీ కన్వీనర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు టిడిపి అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. వీరికి టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, టిడిపి సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్, టిడిపి నెల్లిమర్ల మండల అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్, నాయకులు సువ్వాడ వనజాక్షి, లెంక అప్పలనాయుడు, అవనాపు సత్యనారాయణ, నల్లం శ్రీను, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం

ప్రజాశక్తి -గుర్ల

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్య ఉప సంచాలకులు డాక్టర్ వైవి రమణ అన్నారు. పోలయవలసలో శనివారం పశువిజ్ఞానబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ పశుభీమా పథకం, సబ్సిడీ పై అందిస్తున్న పశుదాణా గొర్రెల పెంపకం దారులకు సబ్సిడీ పై వలలను అందిస్తున్నామన్నారు. సంచార పశువైద్య సేవలు పొందేందుకు 1962 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేస్తే అంబులెన్స్ వస్తుందన్నారు. ఈ సేవలను రైతులంతా వినియోగించి కోవాలన్నారు. కార్యక్రమంలో ఎడి డాక్టర్ టి.రమణాచలం, పోలయవలస, తెట్టంగి గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, గ్రామ పెద్దలు మొల్లి అప్పన్న, పశువైద్యాధికారులు సతీష్, ఫణీంద్ర, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మట్టి నమూనాలతో రైతులకు మేలు

ప్రజాశక్తి - కొత్తవలస

మట్టి నమూనాలతో రైతుకు మేలు జరుగుతోందని జిల్లా వ్యవసాయాధికారి బిటి రామారావు అన్నారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పిఎం కిసాన్) ఇకెవైసి, మట్టి నమూనా సేకరణ అంశాలపై వ్యవసాయ సహాయకులు పని తీరును తెలుసుకునేందుకు మండల కేంద్రంలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ పీఎం కిసాన్ రాని రైతులందరూ తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలన్నారు. రైతులందరూ తమ పొలాల్లో మట్టి నమూనాలు తీసుకోవాలని తెలిపారు. భూసార పరీక్షలు చేయించుకోవటం వల్ల నేలలో ఉన్న పోషకాలను బట్టి నేలకు ఎరువులు వేసి, మంచి దిగుబడులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస వ్యవసాయ సహాయ సంచాలకులు విజయ, మండల వ్యవసాయాధికారిణి మాధురి శరణ్య, ఎఇఒ గణేష్, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు దుర్గారావు, రవి ప్రకాష్, రైతులు పాల్గొన్నారు.

వెల్నెస్ సెంటర్ ప్రారంభం

గజపతినగరం : మండలంలోని కొత్తబగ్గాంలో హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా వైద్య శాఖలో 40 వేల పోస్టులను భర్తీ చేశామని, కొత్తగా మెడికల్ కాలేజీలు నిర్మాణం జరుగుతుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గార తవుడు, సర్పంచులు పల్లి శ్రీకావ్య, బెల్లాన త్రినాధరావు, గ్రామ పెద్దలు పల్లి సంజీవరావు, వైద్యాధికారులు ఎం. కృష్ణారెడ్డి, అనూజ్‌రాయ్, ఎంఎల్‌హెచ్‌పి మంజుల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

వేపాడ: మండలంలో సోంపురం గ్రామంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఆర్‌బికెను ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ శనివారం పరిశీలించారు. ప్రారంభానికి అవసరమైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుడివాడలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. వేతనదారుల మస్తర్లను తనిఖీ చేశారు. పనిచేసే చోట వేతనదారులకు అవసరమైన తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు, టెంట్లు లేకపోవడంపై ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి పరిశీలనకు వచ్చేటప్పటికి వేతన దారులకు ప్రభుత్వ పరంగా కల్పించాల్సిన అన్ని సౌకర్యాలనూ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సోంపురం గ్రామ సర్పంచ్ మురిపిండి గంగరాజు, గుడివాడ ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

కళింగ వైశ్య సాధికార సమితి కన్వీనర్‌గా గెంబలి

బొబ్బిలి: కళింగవైశ్య సాధికార సమితి జిల్లా కన్వీనర్‌గా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు ఎంపికయ్యారు. రాష్ట్ర కమిటీ నుంచి కళింగవైశ్య సాధికార సమితి జిల్లా కన్వీనర్‌గా ఎంపిక చేస్తూ మార్గదర్శకాలు వచ్చినట్లు ఆయన శనివారం చెప్పారు. టిడిపి బలోపేతానికి పని చేస్తామన్నారు. తనపై నమ్మకం ఉంచి ప్రతిపాదనలు చేసిన మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావుకు, నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

'గొంప కృష్ణను విమర్శించే స్థాయి చల్లాది కాదు'

ప్రజాశక్తి - వేపాడ

టిడిపి నియోజకవర్గ యువనేత గొంప కృష్ణను విమర్శించే స్థాయి మాజీ సర్పంచ్ చల్లా వెంకటరావుది కాదని కొండగంగుపూడి గ్రామస్తులు అన్నారు. చల్లా వెంకటరావు గొంప కృష్ణను విమర్శించడాన్ని గ్రామస్తులంతా శనివారం ఖండించారు. చల్లా వెంకటరావు టిడిపిలో ఉంటూ వైసిపి వారితో చేతులు కలిపి గ్రామంలో గ్రూపు రాజకీయాలను ప్రేరేపిస్తున్నారన్నారు. గొంప కృష్ణ పార్టీ కోసం కృషి చేస్తుంటే ఓర్వలేని చల్లా అనవసరపు నిందులు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చల్లా సర్పంచ్‌గా పనిచేసిన సమయంలో కేజీపూడి పంచాయతీ పరిధిలో గల గిరిజనులను మోసం చేసి జిల్లా మత్స్య శాఖ నుండి ఆటోలు, సైకిళ్లు తెచ్చి తమకు ఇవ్వకుండా వైసిపి నాయకులు చెప్పిన వారికి ఇస్తున్నారన్నారు.

నేరాలు ఘోరాలు

పిడిఎస్ బియ్యం పట్టివేత

కొత్తవలస: మండలంలోని ముసిరాం బిసి కాలనీ నుండి దేవరాపల్లికు అక్రమంగా శనివారం తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని పట్టుకునిన సీజ్ చేసినట్లు సిఎస్‌డిటి రమేష్ తెలిపారు. ఎపి 31టిజి 1983 ఆటోలో రవాణా చేస్తున్న పిడిఎస్ బియ్యం 3.20 క్వింటాళ్లను సీజ్ చేశామన్నారు. బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్న గాలి ఉమా మహేశ్వరరావుపై ఈసీ యాక్ట్, 1955 ప్రకారం 6 కేసు నమోదు చేశామన్నారు. సీజ్ చేసిన బియ్యంపై అధికారుల తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు పిడిఎస్ పాయింట్ ఇంచార్జీ, కొత్తవలసలో భద్రపరుస్తామన్నారు. సీజ్ చేసిన ఆటోను స్థానిక పోలీసు స్టేషన్‌కు అప్పగించామన్నారు.

గడ్డివాములు దగ్ధం

బొబ్బిలి: పట్టణంలోని కోరాడవీధి శివారులో ఉన్న కళ్లంలో బండారు రవి, తిరుపతిలకు చెందిన గడ్డి కుప్పలకు శనివారం ప్రమాదవశాత్తు నిప్పంటడంతో దగ్ధమయ్యాయి. స్థానికులు, యువత ఒకవైపు మంటలను అదుపు చేస్తూ మరోవైపు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదంలో ఐదు గడ్డి కుప్పలు దగ్దమయ్యాయి.

వంగర: మండలంలోని కొప్పర పొలాల్లో గడ్డివాము శనివారం దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు పొలాల్లో మంటలు పెట్టడం వల్ల ఆ నిప్పులు చెలరేగి కొప్పర నుండి కొత్తవలసకు వెళ్లే రోడ్డులో ఉన్న గడ్డివాముపై పడి దగ్ధమైంది. అయితే దీని పక్కనే ఉన్న ఆర్‌డబ్ల్యుఎస్‌కు సంబంధించిన చిన్నపాటి విద్యుత్తు పరికరాలు కాలిపోయాయని స్థానికులు తెలిపారు.

పేకాట శిబిరం పై దాడి

నెల్లిమర్ల: పారసాంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం రాత్రి దాడి చేసి 9మంది పేకాట రాయుళ్ల ను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 92,280 నగదు స్వాధీనం చేసుకున్నారు. పారసాంలో పేకాట శిబిరం నడుస్తున్నట్లు సమాచారం రావడంతో తమ బృందంతో కలిసి దాడి చేసి పట్టుకున్నామని ఎస్ఐ నారాయణరావు తెలిపారు.

డెంకాడ: మండలంలోని మోధవలస పంచాయతీ వల్లూరు వద్ద శనివారం ఆరుగురు పేకాట రాయుళ్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. వల్లూరు సమీపంలో పేకాట జరుగుతున్నట్లు సమాచారం రావడంతో తనసిబ్బందితో పేకాట శిబిరంపై దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1.75 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆరు సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్టు తెలిపారు. వీరిని అరెస్ట్ చేసి కోర్టుకి తరలిస్తామని చెప్పారు.

అధికారులు కావలెను

- ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి, హౌసింగ్ ఎఇ పోస్టులు ఖాళీ
- వెలవెలబోతున్న మండల కాంప్లెక్స్
- సీనియర్ సహాయకులతోనే సమావేశాలు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలో ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి, హౌసింగ్ ఎఇ, తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్, జూనియర్ అసిస్టెంట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో కార్యాలయాలకు తమ సమస్యలు చెప్పుకుందామని వచ్చిన ప్రజలకు సమాధానం దొరకడం లేదు. ఖరీఫ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖలో ఎంపిఇఒ కూడా రెండు ఖాళీగా ఉండటంతో రైతులు ఇబ్బంది పడే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో మండలానికి అధికారులు కావలెనని ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

మండలానికి ప్రస్తుతం రాజాం ఎంపిడిఒ బాసూరు శంకర్రావును ఇంఛార్జి ఎంపిడిఒగా వేశారు. ఈయనకు ఇష్టం లేకపోయినా ఉన్నతాధికారులు ఆదేశాలతో వారానికి ఒకసారి వచ్చి పోతూ ఉంటున్నారు. ఇఒపిఆర్‌డిగా పనిచేసి నాగభూషణరావు పదోన్నతపై పార్వతీపురం మన్యం జిల్లాకు డిఎల్‌పిఒగా వెళ్లిపోవడంతో ఈ రెండు పోస్టులు ఖాళీ అయ్యాయి. దీంతో సీనియర్ సహాయకులు అన్నీ తానై నడిపిస్తున్నారు. హౌసింగ్ ఎఇగా పనిచేసిన సూర్యప్రకాశరావు ఇటీవల పదవీ విరమణ చేయడంతో రాజాంలో పనిచేస్తున్న ఎఇని ఇక్కడ ఇంచార్జిగా వేయడంతో ఎవరో తెలియని పరిస్థితి నెలకొంది. తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ పోస్టు పూర్తిగా ఖాళీగా ఉంది. ఇక్కడ పనిచేసిన సీనియర్ అసిస్టెంట్ చీపురుపల్లి ఆర్‌డిఒ కార్యాలయానికి డిప్యూటేషన్ పై వెళ్లారు. దీంతో మండలంలో మండల స్థాయి అధికారులు లేకపోవడంతో వివిధ సమస్యలపై


ఎంపిడిఒ లేక ఖాళీగా ఉన్న కుర్చీ

వచ్చిన అర్జీదారులకు సమాధానమే కరువైందని వాపోతున్నారు. వ్యవసాయ శాఖలో రెండు పోస్టులు ఖాళీ కాగా, కోడిశ, సరసనాపల్లి, రేగిడి, తునివాడ గ్రామాల సచివాలయాల్లో వివో పోస్టులు పూర్తిగా లేవు. వెంకంపేట, అంబకండి, నాయిరాలవలస ఇంచార్జీలతోనే కొనసాగుతున్నాయి. వైకెపిలో పనిచేస్తున్న సీసీ క్లస్టర్ ఖాళీగా ఉండడంతో రేగిడి మండలం వెలవెల బోతుంది. సోమవారం స్పందన, గురువారం అధికారుల సమావేశాలకు మండల స్థాయి అధికారులు లేకపోవడంతో తూతూ మంత్రంగా ముగించేస్తున్నారు.

మండలంలోని 25 సచివాలయాల్లో పనిచేస్తున్న శాఖల వారి ఉద్యోగులకు ప్రతి సోమవారం సమావేశాలు నిర్వహించవలసి ఉంది. కానీ ఆ స్థాయిలో మండలంలో అధికారులు లేకపోవడంతో ఎవరికి వారే యమునా తీరుగా సచివాలయ వ్యవస్థ ఉంది. ముఖ్యంగా హౌసింగ్‌కు సంబంధించి ఎఇ లేకపోవడంతో బిల్లులు చెల్లింపులో జాప్యం జరుగుతుందని గ్రామాల్లో విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో దిగువ స్థాయి సిబ్బందితోనే నిర్వహణ జరుగుతోందని, సచివాలయ వ్యవస్థతో పాటు ఇతర శాఖలకు పరివేక్షణ లేకపోవడంతో కొన్ని కార్యాలయాలు తాళాలకే పరిమితం అవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి పూర్తిస్థాయి మండల అధికారులు నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

డెంకాడ: కాంగ్రెస్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షులు తెలుగు సూరిబాబు అన్నారు. మండల కేంద్రంతో పాటు చందకపేట గ్రామాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేయి చేయి కలుపుదాం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రమణ అప్పల రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ

బొబ్బిలిరూరల్ : మండలంలోని కోమటిపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం ఏడిఏ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలు అవుతున్న దృష్ట్యా ప్రభుత్వం రాయితిపై విత్తనాలు పంపిణీ చేస్తుందన్నారు.

ఆమెను ఎలా నియమిస్తారు?

మెంటాడ : మెంటాడ గ్రామానికి చెందిన పల్లి సరస్వతిని జి.టి పేట ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఎలా నియమిస్తారని ఉపాధి వేతనదారులు టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు చలుమూరి వెంకటరావుతో కలసి ఎంపిడిఒకు శనివారం ఫిర్యాదు చేశారు. ఆమె వ్యవహారం పై గతంలో ఫిర్యాదు చేశామని అయినా పట్టించుకోకుండా, విచారణ జరపకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఆమె రాజకీయం చేయడమే కాకుండా తగాదాలు సృష్టిస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - వేపాడ


వేపాడ: విద్యార్థులకు నగదు ప్రశంస పత్రం అందిస్తున్న నాయకులు

మండలంలోని ఎన్‌కెఆర్‌పురం, వావిలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సహంతో పాటు సత్కారాలను ఆ గ్రామ సర్పంచులు చేతులు మీదుగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో వావిలపాడు, ఎన్‌కెఆర్‌పురం సర్పంచులు బి రాజేశ్వరి, గొటివాడ దేవి, నాయకులు సతీష్, ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

శృంగవరపుకోట: ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన మిడతాన లిఖిత, కరగాన జాహ్నవి, గొర్లే కౌశిక్‌లను జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా శనివారం సత్కరించారు. హెచ్ఎం సబ్బవరపు వెంకటరావు ఆధ్వర్యంలో సర్పంచ్ గాలి సన్యాసయ్య, ఎంపిటిసి కనకమహాలక్ష్మి, పిఎంసి చైర్మన్ తగరంపూడి రమణలు చేతులు మీదుగా నగదు ప్రోత్సాహం అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నురు శ్రీరాములు మాట్లాడుతూ లిఖిత చదువులోనే కాకుండా క్రీడల్లో కూడా జిల్లా స్థాయిలో చెస్ ఛాంపియన్‌గా నిలిచి ఎంతోమంది క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విఈ సత్యనారాయణ, ఈశ్వరరావు, జిఎస్ చలం, కృష్ణ, సఖీనాబీ, లగుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను హెచ్ఎం దత్తి సత్యన్నారాయణ ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి పి.రామారావు, ఎంపిటిసి డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఫలితాలను మెరుగుపరిచి విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకే జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. అనంతరం ఆర్. హర్షవర్ధన్, పి.హిరణ్మయి, సుధీర్, పవన్‌లను సత్కరించి నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది రమేష్, కె.ఈశ్వరరావు, రామారావు, త్రినాథ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకోండి

ప్రజాశక్తి- బొబ్బిలి

సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు పని చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం నాలుగు వారాలు నిర్వహించాలన్నారు. ప్రజలు సంతృప్తి చెందేలా సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పని చేయాలన్నారు. సచివాలయాల్లో ఇంటిగ్రేటెడ్ ధ్రువ పత్రం, ఆదాయ ధ్రువీకరణ, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ సర్టిఫికేట్, ఇతర సర్టిఫికేట్స్ సకాలంలో జారీ చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, పాల్గొన్నారు.

వేపాడ : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సదస్సులో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, ఇంఛార్జి తహశీల్దార్ సన్యాసినాయుడు, ఎంపిడిఒ పట్నాయక్ మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు జగనన్న సురక్షపై పూర్తి అవగాహన ఉండాలన్నారు.

కొత్తవలస: జగనన్న సురక్ష పథకం పై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మండల స్పెషల్ ఆఫీసర్ ఆర్ పాపారావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ పథకం ద్వారా ప్రజలు జరిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపిడిఒ వై. పద్మజ, డిప్యూటీ తహశీల్దార్ జే. అప్పారావు, ఎంఇఒ జి. శ్రీదేవి, పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : జగనన్న సురక్ష పై స్థానిక తహశీల్దార్, మండల పరిషత్ కార్యాలయం వద్ద తహశీల్దార్ రాజేశ్వారావు, ఎంపిడిఒ రవి కుమార్‌లు విఆర్‌ఒలు, కార్యదర్శిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ప్రతిష్టత్మాకంగా తీసుకు వచ్చారాని దీని పై ప్రతి ఉద్యోగి అవగాహనా కలిగి వుండాలనీ అన్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు అందేవిధంగా, సమస్యలు పరిస్కారం జరిగే విధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో డిటి గౌరిశంకర్రావు, ఇఒపిఆర్‌డి భాస్కరరావు, విఆర్‌ఒలు, కార్యదర్శిలు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని కొట్యాడ గ్రామ పంచాయతీలో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. స్థానికలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొట్యాడ రెవెన్యూ సర్వేనెంబర్ 218/1 లో (జగనన్న లేఔట్ ఆనుకుని) హెల్త్ సబ్ సెంటర్ వద్ద ప్రభుత్వ అవసరాల కొరకు సుమారు 20 సెంట్లు భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఆ భూమిపై కన్నేసిన కొందరు కబ్జా చేసేందుకు పూనుకున్నారు. గృహ నిర్మాణ పనులు చేపట్టడంతో రెవెన్యూ అధికారులు పలుమార్లు అడ్డుకొని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఎలాగైనా ఆ భూమిని కబ్జా చేయాలని ఉద్దేశంతో ఈ నెల 10న రాత్రికిరాత్రే అంబేద్కర్ విగ్రహాన్ని ఆ స్థలంలో ప్రతిష్టించారు. ఈ విషయంపై 'ఆక్రమణ భూమిలో అంబేద్కర్ విగ్రహం' అనే శీర్షికతో 11న 'ప్రజాశక్తి' లో కథనం వెలువడింది. స్పందించిన ఎస్‌సి సామాజిక వర్గానికి చెందినవారు రహస్యంగా రాత్రికి రాత్రి విగ్రహాన్ని ప్రతిష్టించడాన్ని తప్పుపడుతూ నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహాన్ని ఎస్‌సి కాలనీలో ప్రతిష్టించాలని ఏకకంఠంతో నినాదించారు. ఈ విషయంపై 12 మందిపై ఎల్ కోట పోలీస్ స్టేషన్లో కేసు నమోదయింది. ఇదిలా ఉండగా ఆక్రమణ భూమిలో ప్రతిష్టించిన అంబేద్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు పడగొట్టారు. పడగొట్టిన విగ్రహాన్ని స్థూపం పై నుండి కిందకు పడేశారు. ఇందుకు సంబంధించిన ఫోటోలను కొట్యాడ గురుమూర్తి గ్రామానికి చెందిన వాట్సాప్ గ్రూప్ లో సెండ్ చేశారు. ఈ మేరకు గ్రామస్తులకు తెలియడంతో


ధ్వంసమైన అంబేద్కర్ విగ్రహం

మద్దిల అప్పారావు, కొట్యాడ కృష్ణ, కొట్యాడ గురుమూర్తి, కొట్యాడ గణేష్ (బుజ్జి) తదితరులపై గ్రామ పెద్దలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌కోట సిఐ ఎస్ సింహాద్రినాయుడు, ఎస్ కోట, వేపాడ, జామి ఎస్‌ఐలు తారకేశ్వరరావు, రాజేష్, వీరబాబు తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. విజయనగరం నుండి క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు. చుట్టు పక్కల మండలాల నుండి అధిక సంఖ్యలో దళిత నాయకులు ఇక్కడకు చేరుకోవడంతో ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆదిబాబు, ఎంపిడిఒ జ్ఞానేశ్వరావు, సర్పంచ్ కొట్యాడ దేవి, నాయకులు మహేష్, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మట్టి నమూనాలతోనే దిగుబడులు

ప్రజాశక్తి- రేగిడి


వెంకటేశ్వరరావు

ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయానికి గ్రామస్థాయిలో మట్టి నమూనాలు సేకరించి వాటికి అనుగుణంగా విత్తనాలు వేసే విధంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన తన స్వగ్రామం ఉణుకూ రులో ప్రజాశక్తితో వ్యవసాయంపై ముచ్చటించారు. ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయానికి రైతులకు శాస్త్రవేత్తలు సూచించిన రకాలు పంటలు పండిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని వెల్లడించారు. అన్ని మండలాల్లో మట్టి శాంపిల్స్ తీసుకొని వ్యవసాయ అధికారులచే నమూనా తీసుకొని వాటి ఆధారంగా పోషకాలు లోపాలను గుర్తించి నానో టెక్నాలజీని వ్యవసాయ అధికారులు వాడుతున్నట్లు తెలిపారు. నాణ్యమైన పంటలు రైతులు వేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఒక్కొక్క ప్రాంతాన్ని బట్టి భూసార పరీక్షలు నిర్వహించి వాటికి సంబంధించి విత్తనాలు ముందుగానే రైతు భరోసా కేంద్రాల్లో నిల్వలు ఉంచామన్నారు. గ్రామస్థాయిలో రైతు భరోసా కేంద్రాలలో రైతులకు కావలసిన వరి విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు, పచ్చి రొట్ట ఎరువులు తదితర రకాలు మందులు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ఏడాది వరి పంటలకు సంబంధించి వరి విత్తనాలు 1121, 1064, స్వర్ణ, సాంబ మసూరు ఆర్బికెల్లో అందుబాటులో ఉంచామన్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో రైతులు రిజిస్ట్రేషన్ ప్రాప్తికే వరి విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు. సకాలంలోనే వరి విత్తనాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రైతులు వరి విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల కోసం ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. సమస్యలు ఏర్పడకుండా ఆయా మండల కేంద్రాల వ్యవసాయ అధికారులకు అవగాహన కల్పించామన్నారు. వరి విత్తనాల పంపిణీలో జాప్యం చేస్తే నేరుగా ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ఏ రైతుకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలూ చేపట్టిందని, అధికారులు వాటికి అనుగుణంగా పనిచేస్తున్నారని వెల్లడించారు.

నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల వ్యాపారం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పుస్తకాల వ్యాపారం చేస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం. హర్ష అన్నారు. పుస్తకాల అమ్మకాలను నిరసిస్తూ శనివారం స్థానిక నారాయణ స్కూల్ పేరుతో గొడౌన్‌లో నిర్వహిస్తున్న అమ్మకాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా హర్ష మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా మండల కేంద్రంలో రిజిస్ట్రేషన్ లేకుండా నడుపుతున్న నారాయణ అలియాస్ కేంబ్రిడ్జి పాఠశాల వాళ్ళ స్కూల్ పేరుతో ఒక ఇంట్లో బహిరంగంగా పుస్తకాలు అమ్మకం చేస్తున్నారన్నారు. వీటిని అడ్డుకుని, నిరసన తెలిపామన్నారు. వీటిపై చర్యలు తీసుకొని పుస్తకాల రూంని సీజ్ చేయాలని మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణని అడిగితే యాజమాన్యంతో కుమ్మక్కై, తమకేంటి సంబంధం, అది తమ పని కాదని భాధ్యత లేకుండా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఇలా విద్యార్థులకు న్యాయం చెయ్యాల్సిన ప్రభుత్వ అధికారులే భాద్యతారాహిత్యంగా ఉంటే పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు ఎలా ప్రభుత్వ విద్య అందుతుందని, ఎలా ప్రభుత్వ విద్య బలోపేతం అవుతుందని ప్రశ్నించారు. తక్షణమే భాద్యతారాహిత్యంగా వ్యవహరించిన మండల విద్యాశాఖాధికారి పెంట సత్యనారాయణపై చర్యలు తీసుకొని విద్యాహక్కు చట్టాన్ని పరిరక్షిస్తూ సామాన్య విద్యార్థులకు న్యాయం జరిగేలా జిల్లా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని లేని పక్షాన జిల్లా వ్యాప్తంగా విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులని ఐక్యం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కోర్రా రమేష్, రిషి, మండల నాయకులు పాల్గొన్నారు.

మరమ్మతులు ప్రారంభం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - వంగర

మండలంలోని గొర్లె శ్రీరాములు నాయుడు మడ్డువలస ప్రాజెక్టు మరమ్మత్తు ప్రధాన పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఈ పనులను ప్రాజెక్ట్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. మడ్డువలస ఆయకట్టుకు సాగునీరందేనా.. నేటికి ప్రారంభం కాని మరమ్మత్తు ప్రధాన పనులు అనే కథనం ఈ నెల 13న ప్రజాశక్తిలో వెలవడంతో స్పందించిన అధికారులు మరమ్మత్తు పనులు ప్రారంభించారు. ఈ పనులు పూర్తయ్యేసరికి మరో 20 రోజులు సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. మరమ్మత్తుల పేరుతో అధికారులు ప్రాజెక్టులో ఉన్న నీటినంతటిని నాగావళి నదిలోకి విడిచి పెట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ప్రాజెక్టులో నీరు ఏమీ లేదు. మరో పక్క ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. వర్షాలు అధికంగా కురిసి ఎగువ ప్రాంతం నుంచి మడ్డువలస ప్రాజెక్టులోకి వరద వస్తే ప్రాజెక్టులో నీరు నిల్వా చేసి దిగువ ఆయా కట్టుకు సాగు నీరు అందించాలి. ప్రస్తుతం వర్షాలు ఏమీ లేవు ఎండలు తీవ్రతరంగా ఉన్నాయి. ప్రాజెక్టులో కూడా చుక్కనీరు లేదు. సాగునీరు అందించే పరిస్థితి ప్రస్తుతం కనబడలేదు. అధికారులు సాగునీరు ఎప్పుడు అందిస్తారో అని రైతులు వేచి చూస్తున్నారు.

జులై నెలాఖరులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి

ప్రజాశక్తి - నెల్లిమర్ల


నెల్లిమర్ల: లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

జులై నెలాఖరులోగా జగనన్న హౌసింగ్ లబ్ధిదార్లు ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి, గృహ నిర్మాణ శాఖ పీడీ ఎస్.వి.రమణ మూర్తి సూచించారు. శనివారం దన్నాన పేటలో హౌసింగ్ డే సందర్భంగా జగనన్న కాలనీను ఆయన, హౌసింగ్ డిఇ జి.మురళీ మోహన్ పరిశీలించారు. ఈ సంధర్భంగా 27 ఇళ్లు మంజూరు కాగా వాటిలో 14 ఇళ్ళు నిర్మాణం పూర్తయిన్నట్లు గుర్తించారు. మిగిలిన 13ఇళ్లు కూడా జూలై నెలాఖరులోగా నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికి ఇళ్ల నిర్మాణం ప్రారంభించని లబ్ధిదార్లకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు నోటీసులు జారీ చేయాలని అప్పటికి ప్రారంభించక పోతే ఇళ్లు రద్దు చేయాలని సూచించారు. నిర్మాణంలో ఇబ్బందులు, బిల్లుల చెల్లింపు సమస్యలుంటే సంబంధిత అధికార్ల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి హెచ్ భానోజీరావు, ఎఇ రేవళ్ల పవన్, సర్పంచ్ జి. చిరంజీవి, నాయకులు తర్లాడ దుర్గా రావు, పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని ముకుందపురంలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమాన్ని ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరు లోగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. 47 మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణం పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పట్నాయక్, ఇంఛార్జి తహశీల్దార్ సన్యాసినాయుడు, పంచాయతీరాజ్ ఇంజనీర్ ఆలీ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి, ఎపిఎం ఆర్ శ్రీనివాసరావు, ఎపిఒ, సర్పంచ్ కనకరాజు, గ్రామ వాలంటీర్లు, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.


గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి- మెంటాడ

ఏ క్షణమైనా ఎన్నికలు నోటిఫికేషన్ విడుదల కావచ్చునని టిడిపి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శనివారం కెబి వలసలో మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైసిపి కుట్ర పూరితంగా గెలవాలని ప్రయత్నిస్తుందన్నారు. వైసిపి నేతలను ఎదురించి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలన్నారు. టిడిపి మ్యానిఫెస్టోలో పొందుపరిచిన అంశాలు ప్రజలకు ముఖ్యంగా మహిళలు, యువతకు ఉపయోగకరంగా వున్నాయని వాటిని ఇంటింటికీ వెళ్ళి చెప్పాలని అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు చలుమూరి వెంకటరావు, గెద్ద అన్నవరం, ముసలి నాయుడు, రెడ్డి ఏర్నాయుడు, జి.ప్రవీణ్, రెడ్డి ఆదినారాయణ, ఎస్ గురునాయుడు, రెడ్డి సత్యనారాయణ, రాజగోపాల్, పి.శ్రీనువాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి- డెంకాడ


సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

మండలం కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డి ఎంహెచ్ఒ ఎస్ భాస్కరరావు శనివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈహెచ్ఆర్, ల్యాబ్‌లో జరుగు పరీక్షలు, డెడ్ స్టోర్, ఆపరేషన్ థియేటర్లను ఆయన పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో జరుగు అన్ని విభాగాల రికార్డులను పరిశీలించి పలు సూచనలు సలహాలు అందజేశారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది డాక్టర్ లావణ్యతో పాటు చేస్తున్న సేవలను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఆరోగ్య కేంద్రంలో ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేసే మండలానికి జిల్లా కి వైద్య సిబ్బంది పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం పెదతాడివాడలో ఉన్న హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను తనిఖీ చేశారు. అక్కడ ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎం రికార్డులను, వారు చేస్తున్న ఏపీపీఎస్, ఎంసిహెచ్ఎండ్‌యుఐపి సెక్షన్‌ను గూర్చి పరిశీలించారు. ఎఫ్‌పిసి ప్రోగ్రాం, ప్రతి ఫ్రైడే డ్రై డే కార్యక్రమం గురించి కూడా ఆరా తీశారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం పావని, సిహెచ్ఒ యేసయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి- వేపాడ

గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం కన్వర్షన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖల వారీగా అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ పట్నాయక్, ఇంఛార్జి తహశీల్దార్ సన్యాసి నాయుడు, మండల పరిషత్ ఇంజనీరింగ్ అధికారి ఆలీ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి, వ్యవసాయ అధికారి యశ్వంత్ కుమార్, వెలుగు ఎపిఎం ఆర్ శ్రీనివాసరావు, పిహెచ్‌సి, వెటర్నరీ వైద్యాధికారులు, ఎపిఒ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.